మత్తుకు బానిసలు కాకుండా కాపాడుదాం

ప్రజాశక్తి - కడియం

యువత మత్తుకు బానిసలు కాకుండా కాపాడుకుందామని జమాఅతె ఇస్లమి హింద్ కడియం శాఖ కన్వీనర్ దాదా ఫరీఫ్ అన్నారు. ఆదివారం ప్రచార కార్యక్రమంలో భాగంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యపానానికి అలవాటు పడి తమ జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, మద్యపానం వల్ల అనేక మంది మృతి చెందుతున్నారని అన్నారు. మత్తుపదార్థాల దుర్వినియోగం పట్ల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపరిచేందుకు .జమాఅతె ఇస్లామి హింద్ ఈ నెల 8వ తేదీ నుంచి 18 వరకూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెఇపారు. ఈ సమావేశంలో మజీద్ కౌసర్ అధ్యక్షలు షేక్ సలీం, షేక్ బాషా,షేక్ రహీం, షేక్ గౌస్, ఇ.మాంజుబైర్ తదితరులు పాల్గొన్నారు.

భవితా దీప్తి...బాలోత్సవ స్ఫూర్తి..

- రెండు రోజుల పాటు సందడే సందడి
- ఆటపాటలతో అలరించిన చిన్నారులు
- 32 విభాగాల్లో పోటీల నిర్వహణ
- విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

చారిత్రక, సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన 'గోదావరి బాలోత్సవం' ఆదివారంతో ముగిసింది. రెండు రోజులుగా కళాశాల ప్రాంగణం బాలల కేరింతలతో మారుమోగింది. చివరి రోజు కోలాహలంగా...ఉత్సాహపూరిత వాతావరణంలో బాలోత్సవం ముగిసింది. ముగింపు వేడుక బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు విఎస్ఎస్.కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగింది. రాజమహేంద్రవరం మాజీ కమిషనర్ ఎం.జితేంద్ర, ప్రముఖ నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్, శ్రీవెంకటేశ్వరా ఫైనాన్స్ అధినేత వేణుగోపాల్, ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎన్ఎస్ఎస్.శర్మ, ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.రామ్మోహనరావు, ప్రముఖ కవి డాక్టర్ అరిపిరాల నారాయణరావు, సంఘ సేవకులు మాటూరి సిద్ధార్థ, స్వామి యాడ్స్ అధినేత భాస్కర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ చైతన్యశేఖర్ తదితరులు మాట్లాడారు. మంచి సమాజాం కోసం అవసరమైన మానవవనరులను అందించేందుకు ఇటువంటి బాలోత్సవాలు అవసరమన్నారు. రాబోయే కాలంలో ఆక్సిజన్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితుల్లోకి సమాజం నెట్టబడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి రెండు రోజుల కార్యకలాపాలను వివరించారు. 32 విభాగాల్లో 5,600 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్, అకడమిక్ కార్యక్రమాల నిర్వాహకులు కాశీ విశ్వనాథం, కృష్ణకుమార్, సాయిబాబా, విజయబాబు, జివిరమణ, ఉపాధ్యాయులు అరుణకుమారి, షరీఫ్ తమ అనుభవాలను పంచుకున్నారు. అమరావతి బాలోత్సవం నిర్వాహకులు టి.క్రాంతికుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న వారికి అతిథుల చేతుల మీదుగా ముగింపు సభలో మెమోంటోలు, మెడల్స్ అందించారు. కల్చరల్ విభాగంలోని క్లాసికల్ డ్యాన్స్‌లో జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతిని తొర్రేడు బ్లోస్సాం స్కూల్ విద్యార్థిని రియాన్షికా రాయుడు సాధించింది. లఘు నాటికలో వేమగిరి జడ్‌పిపి హైస్కూల్ విద్యార్థిని కె.జ్ఞానశ్రీ, జానపద నృత్యంలో శ్రీసాయి బాలాజీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించారు. కోలాటంలో జయకృష్ణపురం స్విట్జర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, విచిత్ర వేషధారణల పోటీలో కాటన్ పేట శ్రీశివనంద యుపి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి పవన్ సందీప్, జానపద గీతాలాపనలో శ్రీరామ్‌నగర్ శ్రీగౌతమి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థుల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. దేశభక్తి, అభ్యుదయ గీతాలాపనలో శ్రీ గౌతమి ఇంగ్లీసు మీడియం స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అకడమిక్ విభాగం కవితా రచనలో కడియపు సావరం మినర్వా ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కె.స్వాతిప్రసన్న, కథా రచనలో చెముడులంక నేతాజీ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి ధనలక్ష్మి, చిత్రలేఖనం జూనియర్స్‌లో రాజమహేంద్రవరంలోని శ్రీ సత్యసాయి గురుకులం స్కూల్ విద్యార్థిని వి.శ్రీవాస్తత్స శ్రావణి, సీనియర్ విభాగంలో కాకినాడ పనసపాడు లిటిల్ ఉడ్స్ స్కూల్ విద్యార్థిని సిహెచ్.ధశ్విక ప్రథమ బహుమతులను గెలుసుకున్నారు. పద్యం-భావం విభాగంలో హుకుంపేట జడ్‌పిపి హైస్కూల్ విద్యార్థిని టిహెచ్.సత్యవిష్ణు ప్రథమ బహమతిని సాధించింది. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. అలాగే వివిధ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వారికి జ్ఞాపికలు అందించారు. ∩ విజేతలకు మెమోంటోలు, మెడల్స్‌ను ఎల్ఐసి సంస్థ, శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్, మన్యం నవీన్ ఎలక్ట్రానిక్స్, కొకోకోల కంపెనీ, ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ గ్రద్యుయేట్స్ అసోసియేషన్ అందచేశారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా ఆయా సంస్థల ప్రతినిధులను మెమోంటోలు అందించి సత్కరించారు.

నూతనోత్సవాన్ని నింపిన బాలోత్సవం

రెండు రోజుల గోదావరి బాలోత్సవం చిన్నారుల్లో నూతనోత్సవాన్ని నింపింది.ఆదివారం అకడమిక్, కల్చరల్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అకడమిక్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో స్పెల్‌బి, కార్టూన్, చిత్రలేఖనం పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగాయి. వక్తృత్వం పోటీల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలోజూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. అంతర్జాలంలో అన్వేషణ సీనియర్స్ విభాగంలోనూ, పద్యం భావం జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, మట్టితో బొమ్మలు తయారీ అంశాల్లో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కల్చరల్ విభాగంలో జానపద నత్యం విభాగంలో సీనియర్స్ పెద్ద ఎత్తున పాల్గొని కళా ప్రదర్శనలు ఇచ్చారు. స్టేజ్ 5 వద్ద సీనియర్ భాగంలో క్లాసికల్ డ్యాన్స్‌లతో చిన్నారులు ఆకట్టుకున్నారు. లఘు నాటిక, ఏకపాత్రాభినయం విభాగాల్లో పెద్ద ఎత్తున చిన్నారులు పాల్గొన్నారు. దేశభక్తి అభ్యుదయ జానపద గీతాలాపనలో తమ తమ ప్రతిభను చాటుకున్నారు. అలాగే సీనియర్స్ విభాగంలో బందాలుగా చేసిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో విచిత్ర వేషధారణ పోటీల్లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలు చేశారు.

ఆట పాటలతో మెప్పించారు... విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలతో ఔరా..! అనిపించారు. నాట్య మయూరాల్లా నర్తించారు... పాటల్లో మాకు మేటి ఎవరు? నాటకాల్లో మాకన్నా సాటి ఎవరు? అని చాటి చెప్పారు... భవిత మాదే భారత్ మాదే అంటూ ఆసల ఊసులతో ఉరిమే ఉత్సాహంతో వచ్చే యేడు మళ్లీ కలుద్దాం..అంటూ బాలోత్సవానికి వీడ్కోలు పలికారు. సృజన్మాకతకు సరైన వేదిక బాలోత్సవం అని రుజువు చేశారు..

చిన్నారులతో నిండిపోయిన ముగింపు సభా ప్రాంగణం

విజేతలతో ముఖ్యఅతిథులు, నిర్వాహకులు

న్యాయ నిర్ణేతలకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

జ్ఞాపికలను అందిస్తున్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ శర్మ

గురువుతో కలిసి ఫొటోకు ఫోజులిస్తున్న విద్యార్థినులు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

నేతన్నల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి వేణు

ప్రజాశక్తి - కడియం

చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని మురముండ గ్రామ పంచాయతీ కళ్యాణ మండపం ఆవరణలో జరిగిన మురమండ, దుళ్ల, వీరవరం, పొట్టిలంక గ్రామాల చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం, చేనేత పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా 557 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు రు. 191 లక్షల ప్రయోజనం చేకూర్చడం జరిగిందన్నారు. 2023-24 సంవత్సరానికి 2వ విడతగా 170 మంది చేనేత కార్మిక లబ్ధిదారులకు రూ.40 లక్షల విలువైన వ్యక్తిగత వర్క్ షెడ్లు, వివిధ రకాల చేనేత ఉపకరనాలను అందించినట్లు చెప్పారు. 2022-23లో మొదటి విడతగా రూ.53.669 లక్షల విలువ గల ఉపకర ణాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, చేనేత జౌళి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు ధనుంజయరావు, ఎడి కె.పెద్ది రాజు, డిఒ రవికుమార్, ఎడిఒ చేతన్, గ్రామ సర్పంచ్ అయినమిల్లి రుక్మిణి, చేనేత సొసైటీ అధ్యక్షులు యర్రా సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులు ఎన్నికల నియమావళి ప్రకారం నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలని ఎస్‌పి జగదీష్ ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అండ్ ఎలక్షన్స్ ప్రాసెస్-2024ను ఆదివారం జెఎన్ రోడ్డులోని ఐఎంఎ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు వారి పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల నియమాలపై సమావేశాలను నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పెద్దలతో శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను బలోపేతం చేయాలన్నారు. గంజాయి, సారా, మద్యం, నగదు ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఫస్ట్ ఎడిజె కోర్టు పిపి జివిఎస్.ప్రసాదరావు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఏపి కేసులు ఎలా నమోదు చేయాలని, వాటిని కోర్టులో ఎలా పొందుపరచాలి, ఎన్నికల నియమావళి అనుసరించి పోలీసు అధికారులు నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. పిపిటి ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల నిబంధనలను వివరించారు. ప్రజాస్వామ్యయుతంగా పౌరులు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉందన్నారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి చర్యలను అడ్డుకోవాలన్నారు. ఎన్నికల సామగ్రికి రక్షణ కల్పించాలన్నారు. ర్యాలీలు, నిరసనల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల అధికారులకు సాయం అందించాలన్నారు. తటస్థంగా ఉండి సేవలందించాలన్నారు. లైసెన్స్ లేని ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సీజ్ చేయాలన్నారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేయించాలన్నారు. రౌడీ షీటర్లు, పరారైన వారిపై నిఘా పెంచాలన్నారు. క్రిమినల్ కేసుల్లో నిందితులు, షీటర్లను గుర్తించాలన్నారు. గత నేరస్తులను బైండోవర్ చేయాలన్నారు. చట్టవిరుద్ధమైన డబ్బు, సామగ్రిని స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. ఈ వర్కుషాపులో డిఎస్‌పిలు, సిఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, ఎలక్షన్ సెల్ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్‌పి, హాజరైన పోలీసు అధికారులు

'నయనాల' సేవలు అభినందనీయం

నయనాల కృష్ణారావును అభినందిస్తున్న ఎంపి భరత్, రుడా చైర్మన్ రౌతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నాలుగు దశాబ్దాల నైనాల కృష్ణారావు నిస్వార్థ సేవలు అభినందనీయమని ఎంపి మార్గాని భరత్ రామ్, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకావరావు అన్నారు. స్థానిక మారంపూడి ఎపిఎస్ఇబి కల్యాణ మండపంలో ఆదివారం నైనాల ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే అంబేద్కర్ భావజాల వ్యాప్తికి, బహుజనుల్లో చైతన్యం నింపి విద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించడానికి నైనాల కృషి ఆదర్శనీయమని అన్నారు. సమాజ సేవకు డాక్టరేట్ ప్రధానం చేయడం, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన్ని సత్కరించుకోవడం సంతోషకరమని తెలిపారు. సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి పూలే కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించడంలో కృష్ణారావు పాత్ర శ్లాఘ నీయమన్నారు. ఆయన జీవితాంతం బిసి వర్గాలను చైతన్యం చేయడం కోసం పాటుపడ్డారని కొనియాడారు. సమావేశానికి స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. కృష్ణారావు చేస్తున్న బహుజన ఉద్యమ కృషికి ప్రత్యేకంగా ఈ ఆత్మీయ సభ ఏర్పాటు చేసి సత్కరించడంతోపాటు, రూ.25 వేల నగదును బహుకరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ ఆకుల.వీర్రాజు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని.కృష్ణ, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, వైసిపి రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్, బిసి జెఎసి చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఎపిఎస్ఇబి ఎస్ఇ కె.తిలక్‌కుమార్, విశ్రాంత ఐఎఎస్ అధికారి విజయకుమార్,. తుమ్మిడి అరుణ్‌కుమార్, మొక మాటి.సత్య నారాయణ, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మింగేసిన వాగు

సీతపల్లివాగులో స్నానానికి దిగిన ముగ్గురు మృతి
స్నేహితుని పుట్టినరోజు నాడే ఘటన
రంపఎర్రంపాలెంలో విషాదం

ప్రజాశక్తి -గోకవరం

స్నేహితుని పుట్టిన రోజు వేడుకలే వారికి చివరి రోజు అయ్యింది. సీతపల్లి వాగులో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ ముగ్గురు విద్యార్థులు ప్రాణాలను కోల్పోయారు. ఈ ఘటనతో గోకవరం మండలం రంప ఎర్రంపాలెంలో విషాదం అలముకుంది. ఆదివారం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి అనిబోయిన మోహన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా స్నేహితులు కాకర వీరవెంకటఅర్జున్, అండిబోయిన దేవిచరణ్, లావేటి రాంజీ, కుంచె వికాశ్‌లతో కలిసి రంపచోడవరం మండలం సీతపల్లి వాగువద్దకు వెళ్లారు. అక్కడ పుట్టిన రోజు వేడుకల అనంతరం వాగులో స్నానానికి దిగారు. ఒక్కసారిగా వాగు పొంగడంతో కాకర వీర వెంకట అర్జున్(16), అండిబోయిన దేవీచరణ్(16), లావేటి రాంజీ(16)మతి చెందారు. కాకర వీరవెంకటఅర్జున్ తాత అర్జున్ అనారోగ్యంతో వారం రోజులుగా రాజమహేంద్రవ రంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొంతున్నాడు. వీర వెంకట అర్జున్ తండ్రి కాకర విష్ణు ఆసుపత్రి వద్దనే ఉంటున్నారు. ఈ సమయంలో కుమారుని మరణవార్త విని ఆయన కన్నీరుమున్నీరయ్యారు. అండిబోయిన దేవిచరణ్ తల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ సమయంలో కుమారుని మరణవార్తతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. లావేటి రాంజీ తండ్రి వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారునిపైనే ఆశలు పెట్టుకుని జీవిస్తున్నాడు. తన కొడుకు లేడని తెలియగానే తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. విద్యార్థులు ఇంట్లో ఎవరికీ సమాచారం చెప్పకుండా వెళ్లారని బంధువులు చెబుతున్నారు.

దేవీచరణ్(ఫైల్) కాకర అర్జున్(ఫైల్) లావేటి రాంజీ (ఫైల్)

కార్టూ'నిజం'

వచ్చే ఎన్నికల్లో వైసిపి గల్లంతే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి గల్లంతు కావడం ఖాయమని టిడిపి నేతలు స్పష్టం చేశారు. స్థానిక ఆనంద్ రీజెన్సీలో ఆదివారం టిడిపి అనుబంధ తెలుగు యువత రాష్ట్ర విభాగం, రాజమహేంద్రవరం పార్లమెంట్ తెలుగు యువత, నగర కమిటీల సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. తెలుగు యువత రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి తెలంగాణా రాష్ట్ర అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ తనదైన చమత్కార ధోరణిలో జగన్ ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేసి అందరినీ ఉర్రూతలూగించారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ సారథ్యంలో రాజమహేంద్రవరం నగరం పసుపు మయమైందన్నారు. రాజమహేంత్రదవరం గడ్డ ఆదిరెడ్డి అడ్డా అనేందుకు ఇదే తార్కాణమన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి, రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి విజయం తథ్యమన్నారు. ఇటీవల జగన్ ప్రకటించింది మెగా డిఎస్‌సి కాదని, దగా డిఎస్‌సి అని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయం వైపు టిడిపి, జనసేన కూటమి అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, టిడిపి నాయకులు వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధా, మజ్జి రాంబాబు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు వై.శ్రీను, యాళ్ల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీల ప్రమాణస్వీకారం చేశారు. తొలుత బైపాస్ రోడ్డులోని నక్కా దేవీవరప్రసాద్ కార్యాలయం దగ్గర నుంచి భారీ ర్యాలీగా యువకులు ఆనంద్ రీజెన్సీకి చేరుకున్నారు.

నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న టిడిపి సీనియర్ నేత వర్రే శ్రీనివాస్

గ్రామానికి మంచినీటి ట్యాంకర్ బహుకరణ

ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్ఎ శేషారావు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామ ప్రజలకు తమ తమ ఇళ్లల్లో నిర్వహించుకునే వివిధ కార్యక్రమాలకు అవసరమైన మంచినీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసిన ట్యాంకర్‌ను మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆదివారం అందచేశారు. పసలపూడిలో మాజీ ఎంపిటిసి మొగళ్ళపు అమ్మిరాజు, స్వరాజ్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పార్థసారథి, కోడలు, మాజీ సర్పంచ్ సువర్ణల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొగళ్ళపు నాగన్న ట్రస్ట్ ద్వారా, రూ.2.50 లక్షల విలువ చేసే 3 వేల లీటర్ల కెపాసిటీతో కూడిన ట్యాంకర్‌ను సూర్యారావుపాలెం టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ వల్లేపల్లి రాజా, మాజీ ఎంపిపి రామలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి కెవి.సుబ్బారావు, మండల టిడిపి అధ్యక్షులు సింహాద్రి రామ కృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో వికలాంగులకు మేలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వైసిపి పాలనలో వికలాంగులకు మేలు చేకూరిందని వైసిపి వికలాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల. పోసి కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పోసి కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు హక్కుల చట్టం 2016ను పూర్తి స్థాయిలో అమల్లోకి తెచ్చారని, వికలాంగుల వివాహ ప్రోత్సాహాన్ని రూ.2 లక్షలకు పెంపుదల చేశారని అన్నారు. సుమారు 1750 మోటారు సైకిళ్ళు పంపిణీ చేశారని, 80 శాతం దాటిన శారీరక వికలాంగులకు పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంపుదల చేసిన ఘనత జగన్ దేనని అన్నారు. కావున రాబోయే ఎన్నికల్లో వికలాంగులంతా వైసిపి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఆర్ట్స్ అటానమస్ కళాశాలకు చెందిన ఎన్‌సిసి మహిళా కేడేట్లు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కె తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే శిబిరంలో కళాశాలకు చెందిన బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న కె.సౌమ్య గార్డ్ ఆఫ్ హానర్‌కు ఎంపికైందని తెలిపారు. ఉపరాష్ట్రపతి, త్రివిధ దళాల అధిపతులు, ప్రధానమంత్రి వంటి వారికి రైఫిల్ సెల్యూట్ చేసే అంశంలో ఆమె పాల్గొనడం అభినందనీయమని అన్నారు. శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరచి ఎన్‌సిసి డిజి మెడల్‌ను అందుకుందని తెలిపారు. అదేవిధంగా కళాశాలకు చెందిన మరొక విద్యార్థిని సిహెచ్ నిరీష రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల శిబిరంలో పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, ఎన్‌సిపి అధికారులు, ఇతర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నేరాలు ఘోరాలు

500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలో కోరుమిల్లి నదీపరీవాహక ప్రాంతంలోని సారా తయారీకేంద్రాలపై సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఇబి సిఐ ఎం.ఎ.ఖాదిర్, ఎస్ఐ ఎ.సత్యవాణి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. నిర్వాహకుని కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సిఐ ఖాదిర్ తెలిపారు. ఈ దాడుల్లో అంగర ఎస్ఐ కె.వరదేశ్, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో సారా స్థావరాలపై ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలిచేరు గ్రామ శివారు, మారిశెట్టి వారి గూడెం శివారు నాటు సారా రవాణా చేస్తున్న మట్ట దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని ఎర్రపోతవరం లాకుల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎల్లి నరసాపురం గ్రామానికి చెందిన పిల్లి ప్రసాద్(28), అనపర్తి సావరానికి చెందిన డి.జాన్ (30) స్కూటర్‌పై యానాం నుంచి ద్రాక్షారామ వైపు వస్తున్నారు. వారు ఎర్రపోతవరం లాకుల వద్దకు చేరుకునే సమయానికి ద్రాక్షారామం నుంచి యానాం వైపు ఎరువుల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

నిందితులు ఉన్న గదిని పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోటలో చోరీ ముఠా మకాం

ప్రజాశక్తి -సామర్లకోట

ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్ బ్యాంకులో ఈ నెల 7న జరిగిన చోరీ కేసుతో సంబంధం ఉన్న ముఠా సామర్లకోటలో ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాకినాడ ట్రైనీ డిఎస్‌పి సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారు. సామర్లకోట -పిఠాపురం రోడ్డులోని ముస్లిముల ఏరియాలో ఐదుగురు సభ్యులు రూమ్ అద్దెకు తీసుకుని బ్యాంకు చోరీకి పాల్పడినట్టుగా అనుమానిస్తున్నారు. సామర్లకోట కోటబజార్ ఏరియా ముస్లిముల ఇంట్లో పది రోజులు పాటు అద్దెకు ఉన్నట్లుగా అనుమనిస్తున్నారు. ఈ మేరకు ఇంటిని పరిశీలించారు. అబ్దుల్లా అనే వ్యక్తి ఇంట్లో ఓ గదిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు సభ్యులు నెలకు రూ.3వేలకు అద్దెకు తీసుకున్నారు. పది రోజులపాటు ఇక్కడే ఉండి ఉత్తరకంచిలో రెక్కీ నిర్వహించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీంతో సుమారు రెండు గంటల పాటు ఈ గదిని పోలీసులు పరిశీలించారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

తాళ్లరేవు మండలం కాపుల పాలెం గ్రామానికి చెందిన చెందిన గుబ్బల వీరవెంకట సత్యనారాయణ నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. యానాం నుంచి అక్రమంగా తరలిస్తుండగా కనకాల పేట ఏటుగట్టు వద్ద పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.8వేలు ఉంటుందన్నారు.

ఎంఎల్ఎను కలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు

ప్రజాశక్తి - యానాం

నూతనంగా ఎన్నికైన యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ కారుమూరి పవన్ దుస్సాలువాతో ఎంఎల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బొంతు సత్య శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ దాసరి కళ్యాణ్‌బాబు, సెక్రటరీ రత్ననాయుడు, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, జాయింట్ ట్రెజరర్ పి.జయపాల్, కో-ఆర్డినేటర్ ఎ.విజయలక్ష్మి, సభ్యులు పితాని రామచంద్రరావు, గౌరీ శంకర్, గీదా సత్యనారాయణ, మెండా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో యానాం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

జాతీయస్థాయిలో జరిగిన ఆట్యాపాట్యా గేమ్స్‌లో యానాం నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని చింతా దుర్గలక్ష్మిషణ్ముఖప్రియ బంగారు పతకం కైవసం చేసుకుందని విద్యా సంస్థల చైర్మన్ నల్లం నాగబాబు తెలిపారు. ముంబైలో ఈనెల 9నుంచి 11వరకూ ఈ జాతీయ స్థాయి పోటీలు జిరగాయన్నారు. అండర్-14 బాలికల విభాగంలో పుదుచ్చేరి జట్టు తరుపున పాల్గొన్న షణ్ముఖప్రియ ప్రతిభ కనబర్చి బంగారు పతకం కైవసం చేసుకుందని తెలిపారు. బాలిక తండ్రి చింతా వెంకన్న వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. పాఠశాల కూడా పూర్తి సహకారం అందించడంతో విద్యార్థి బంగారు పతకం సాధించిందని నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా బాలికను పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, నల్లం విద్యా సంస్థల చైర్మన్ నల్గం నాగబాబు, ఎన్ఆర్ఐ చింతా గణేష్, శివ తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా... ఉల్లాసంగా...

గోదావరి బాలోత్సవం పిల్లలపండుగలో చిన్నారులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో పాల్గొన్ని ప్రతిభను కనబర్చారు. తమ సృజనాత్మకతలకు పదును బెట్టారు. రెండు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన ఈ పండుగ ఆదివారం సాయంత్రంతో ముగిసింది.

జానపదం

కోలాటం..

చిత్రలేఖనం

క్లాసికల్ నృత్యం

నన్నయ విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి బాలోత్సవం రెండవ పిల్లల పండుగలో సేవలందించిన నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య శ్రీనివాసరావు ప్రశంసించారు. రాజమండ్రి ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో గోదావరి బాలోత్సవం పిల్లల పండగ అంగరంగ వైభవంగా జరిగింది. ఆరు మండలాల నుంచి విచ్చేసిన వేలమంది విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ అకాడమిక్, కల్చరల్ కార్యక్రమాలలో జడ్జెస్‌కు, కార్యక్రమ నిర్వాహకులకు సహకారులుగా ఉంటూ వాలంటీర్లు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు అయిన శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ విద్యా శిక్షణా కళాశాల నుండి 80 మంది విద్యార్థులు, ఆదిత్య కాలేజ్ నుంచి 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రాజమహేంద్రి కళాశాల నుంచి 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ బాలోత్సవంలో సేవలందించారు. విశ్వవిద్యాలయా అధికారులకు, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు, ప్రోగ్రాం ఆఫీసర్లకు విద్యార్థులకు గోదావరి బాలోత్సవం అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.ఎస్.ఎస్ కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

మలేరియా అధికారి భాస్కరరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వాతావరణంలో మారుతున్న పరిస్థితులను బట్టి వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవగాహన ఉంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) ఎస్.భాస్కరరావు అన్నారు. సీజన్లో ప్రధానంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులతో పాటు విషజర్వాలు ప్రబలే అవకాశం ఉన్నందున దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. నీటి నిల్వ లేకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలి.

వర్షాకాలం వచ్చే సరికి నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను వివరించారు.

మలేరియా, డెంగ్యూ ఎలా వ్యాపిస్తుంది. మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి

డెంగ్యూ వ్యాపించే ఆడ ఎడిస్ దోమ శుభ్రమైన నీటిలో పెరుగుతుంది. ఈ దోమ కుట్టిన వారం రోజులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే డెంగ్యూగా పరిగణించాలి. వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు (ప్లేట్లెట్స్) తగ్గి పరిస్థితి విషమించే ముప్పు ఉంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యు సోకుండా చూసుకోవచ్చు. ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసరాల్లో నీరు నిలిస్తే ఆయిల్ బాల్స్ చల్లాలి. కాకినాడ జిల్లాలో 2019లో 513, 2020లో 72, 2022లో 496 కేసులు, 2023లో 224, ఈ ఏడాది ఇప్పటి వరకు 6 కేసులు వెలుగులోకి వచ్చాయి. అప్రమత్తంగా లేకుంటే కేసుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

వ్యాధుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గతేడాది ప్రతి ఇంటిలోనూ ఒకరికి వ్యాధులు సోకి ఆస్పత్రులలో చికిత్స పొందారు. ఈ ఏడాది కూడా వ్యాధుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలోని, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ కాలంలో దోమల వద్ధి ఎక్కువగా ఉంటుంది. పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. పూలకుండీలు, వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టుపక్కల పాత టైర్లు, తాగి పాడేసిన కొబ్బరి బోండాలు ఉండకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం మంచింది.

డయేరియా రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

కలుషిత నీటిని తాగడం, ఆహారాన్ని తినడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. వర్షాలకు ఇంటి పరిసరాలు చిత్తడిగా మారి ఈగలు పెరుగుతాయి. ఈగలు మనం తినే ఆహార పదార్థాలపై వాలి కలుషితం చేస్తాయి. దీంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకకుండా పరిసరాల శుభ్రతను పాటించాలి. ఇంట్లోకి ఈగలు రాకుండా జాలీ వంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు, ద్రవపదార్థాలు పడేయకూడదు. వేడి పదార్థాలను తీసుకోవడం మంచింది.

వైరస్‌ల ప్రభావంతో వచ్చే జర్వాలు వాటి ప్రభావం ఎలా ఉంటుంది

వర్షాలు కురిసే సమయంలో వైరస్ ప్రభావం ఎక్కువ ంటుంది. దగ్గు, జలుబుతో మొదలై జ్వరం వస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఎక్కువై ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. వృద్ధుల్లో శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఆయాసం పెరుగుతుంది. చిన్నపిల్లల్లో జ్వరం ఎక్కువగా వస్తే మూర్ఛపోయే అవకాశాలు ఉంటాయి. నిల్వ ఉన్న పదార్థాలు తినకూడదు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించడం వల్ల వైరస్‌లు వ్యాపించవు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కూడా శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిని తాగాలి.

సీజన్ వ్యాధుల నివారణ కోసం చేపడుతున్న చర్యలేమిటి

కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాము. క్షేత్ర స్థాయిలో పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల్లో డెంగ్యూ ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచాము. డెంగీ కేసులున్న చోట 50 నుంచి 60 ఇళ్ల పరిధిలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే, యాంటీ లార్వా గాలిలో మందు పిచికారీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతోపాటు పిహెచ్‌సి, సిహెచ్‌సిల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేస్తున్నాము. వైద్య సిబ్బందిని, ఆంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

వైద్య సేవలందిస్తున్న వైద్యులు

వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన కార్డియాక్ హాస్పిటల్‌కు చెందిన గుండె వైద్య నిపుణులు టూ. డి. ఎకో, గుండె స్కానింగ్, ఇసిజి వంటి పరీక్షలను నిర్వహించారు. మెరుగైన పరీక్షలు అవసరమైన వారిని విజయవాడ ఆసుపత్రికి వెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. వీరిలో 14 మందికి యాంజియోగ్రామ్, ఆపరేషన్ అవసరం పడగా, ఇద్దరికి గుండె సైజు పెరగడంతో అత్యవసర వైద్యం అవసరమవుతుందని గుర్తించినట్లు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఆసుపత్రి యాజమాన్యానికి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు.

బహుమతులను అందుకుంటున్న విద్యార్థినీలు

కోలాటంలో మొదటి బహుమతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం నగరంలో నిర్వహించిన గోదావరి బాలోత్సవంలో కోలాటం ప్రదర్శనలో ధవళేశ్వరం ఎంపిపి ఎర్రకొండ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. విజయాన్ని సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం ఎన్వి.పద్మప్రియ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి వనితను సత్కరిస్తున్న గూడూరి దంపతులు

హోం మంత్రిని కలిసిన గూడూరి

ప్రజాశక్తి - కొవ్వూరు

హోంమంత్రి తానేటి వనితను రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన వారు ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరికి హోంమంత్రి వనిత శుభాకాంక్షలు తెలిపారు.

నీటి పిల్లుల సంరక్షణతో జీవ వైవిధ్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జీవవైవిధ్యానికి ఎంతగానో దోహదం చేసే నీటి పిల్లుల సంరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి అన్నారు. చొల్లంగిలోని కోరంగి పర్యాటక కేంద్రంలో కోరింగ వైల్డ్ లైఫ్ రేంజ్ ఆధ్వర్యంలో నీటి పిల్లుల దినోత్సవ ముగింపు కార్యక్రమం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ అధ్యతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎఫ్ఒ భరణి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన ఉండాలని, నూత్న ఆలోచనలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి పర్యావరణపై అవగాహన కల్పించారు. మానవ తప్పిదాల వల్ల జీవజాతులు అంతరించిపోతున్నాయని చెప్పారు. అలాంటి వాటిలో నీటి పిల్లులు ఒకటన్నారు. వాటిని సంరక్షించుకోవడానికి దినోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నీటి పిల్లుల పోస్టర్లను ఆవిష్కరించారు. రెండు నిమిషాల నిడివిగల నీటి పిల్లుల డాక్యుమెంటరీని విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎంజివి.ప్రసాద్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

పలుగ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ ఆదివారం శ్రీకారం చుట్టారు. కనకాల పేట, మెట్టకూరు, ఫరంపేట, సుభద్రనగర్, మొండి వారి వీధిలో డ్రెయినేజీల ఆధునికీకరణ, రోడ్ల నిర్మాణం, ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. పలు గ్రామాల్లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో తన సొంత ఖర్చులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లోనూ త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జి ప్రాంతీయ పరిపాలనాధికారి నాయక్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ప్రజా పనుల శాఖ ఎఇ కాళ్ల నాగరాజు, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, ఎఇ కుమార్ పాల్గొన్నారు.

జగన్ పాలనతో మహిళా సాధికారత

ప్రజాశక్తి - రాజానగరం

సిఎం జగన్మోహన్ రెడ్డి పాలన మహిళా సాధికారతకు ఆదర్శమని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, హోంమంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక రాయల్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా గల ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఆడప డుచుల ఆశీర్వాద సభ జరిగింది. ఈ సందర్భంగా రూ. 215 కోట్లతో ఇంటింటికి గోదావరి జలాలు సరఫరా కార్యక్రమానికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కుటుంబాల్లో జగన్ వెలుగులు నింపుతూ పేదరికాన్ని దూరం చేస్తున్నారని అన్నారు. గతంలో 12 శాతం ఉండే పేదరికం ప్రస్తుతం 6 శాతానికి తగ్గిందన్నారు. ఆడవాళ్లు సిఎంగా ఉన్న రాష్ట్రాల్లోనూ అమలు కాని సంక్షేమ పథకాలను జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలో భాలకు లొంగకుండా వైసిపిని గెలిపించాలని కోరారు. అబద్ధం చంద్రబాబు రూపమైతే నిజం జగన్ రూపమని అన్నారు. ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ క్లినిక్‌లతోపాటు, నాడు నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. సీతానగరం రోడ్డును రూ.104కోట్లతో నాలుగు లైన్ల రహదారిగా రూపొందించామని వివరించారు. రూ.215కోట్లతో గోదావరి జలాలను ఇంటింటికి కుళాయిల ద్వారా సరఫరా చేయడానికి ప్రణాళిక వేసి శ్రీకారం చుట్టామని అన్నారు. ఎంపి వంగా గీత మాట్లాడుతూ 2019కి ముందు ప్రభుత్వాలు ఎలా ఉన్నాయి, దాని తర్వాత ప్రభుత్వ తీరు ఎలా ఉందో ఆలోచించాలని సూచించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న రాజాను మరోసారి గెలిపించాలని కోరారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం కోసం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా చేసుకోవాలని కోరారు. ఎంఎల్‌సి వరదు కళ్యాణి మాట్లాడుతూ రాజకీయాల్లో చాలా కుటుంబాలుంటాయని అయితే విధేయతకు, విశ్వాసానికి జక్కంపూడి కుటుంబం మారుపేరని అన్నారు. ఎంఎల్‌సి పోతుల సునీత మాట్లాడుతూ ఒక నిబద్ధతతో, మహిళా పక్షపాతంతో ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్ఎ

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

ఘనంగా నాగేశ్వరరావు పుట్టినరోజు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పూలే ప్రజా చైతన్య వేదిక అధ్యక్షుడు, టిడిపి నాయకులు చీకట్ల నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు స్థానిక యువకులు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పదో క్లస్టర్ ఇన్‌ఛార్జి మోపూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాగేశ్వరరావు కనబరిచే ఉద్యమ స్ఫూర్తి ఆదర్శనీయమని అన్నారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది పేద మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర రామచంద్ర రావు, తాతపూడి నాగేశ్వరరేవు, శ్రీలక్ష్మీగణపతి వర్తక సంఘం ప్రెసిడెంట్ నామా గోపాల కృష్ణ, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ విత్తనాల ఈశ్వరరావు,పాల్గొన్నారు.

కరాటేలో బాలభారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- తాళ్లరేవు

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం నిర్వహించిన 4వ ఎపి ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో శ్రీ బాల భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు కరెస్పాండెంట్ పి.బాల వెంకటరమణ తెలిపారు. ఈ పోటీల్లో ఏడో తరగతి విద్యార్థి గుబ్బల శ్రీమన్నారాయణ గోల్డ్ మెడల్ సాధించాడు. మల్లాడి నరేంద్ర వర్మ (7వ తరగతి), ఇళ్ల విజయ్ కుమార్ (5వ తరగతి) సిల్వర్ మెడల్స్ సాధించారు. ఐదవ తరగతి విద్యార్థులు వెదురుపాక దుర్గా మణికంఠ, సమనస వికాస్ శ్రీ సత్య కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

విశ్వనగరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం: ఎంపి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని 4వ వార్డు ఉమెన్స్ కాలేజీ రోడ్డు జంక్షన్ నుంచి రాజేంద్ర నగర్ మెయిన్ రోడ్డు వరకూ రూ.47.9 లక్షలతో చేపట్టే బిటి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే 9వ వార్డులో రామాలయం జంక్షన్ నుంచి నేషనల్ హైవే 26 వరకూ రూ.1.17కోట్లతో బిటి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో నగరంలోని అన్ని ప్రధాన రహదారులను సిసి రోడ్లుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. నాణ్యతలో రాజీ పడకుండా ప్రత్యేక పర్యవేక్షణలో పనులు చేయిస్తానని చెప్పారు. ఎంఎల్ఎగా గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమాల్లో రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నక్కా శ్రీనగేష్, బొంతా శ్రీహరి, ఎన్వి.శ్రీనివాస్, బళ్ల శ్రీనివాస్, పాల సాయి, ముప్పణ ప్రభాకర్ పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి భరత్, రుడా ఛైర్మన్ రౌతు

జగ్గంపేటలో ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేటలో వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఆదివారం మాజీ మంత్రి, వైసిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసింహం మాట్లాడారు. మహిళల కోసం వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి వంటి పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్ మోహన్ రెడ్డిదే అన్నారు. భారతదేశంలోనే ఇటువంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సిఎం ఎవరూ లేరన్నారు. మండలంలోని 1,818 స్వయం సహాయక సంఘాలకు విడుదలైన రూ.16.39 లక్షల వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు అత్తులూరి నాగబాబు, చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపిపి నక్కా శ్రీను, వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, తోట రామ్‌జీ, అత్తులూరి సాయిబాబు, ఎపిఎం జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా స్పందన

రాజమహేంద్రవరం రూరల్ : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం నేడు యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయిలో తహశీల్దార్లు, గ్రామ, వార్డు స్థాయి సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.కావున ఈ అవకాశాన్ని అర్జీదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ మాధవీలత సూచించారు.

పలువురికి వరుపుల పరామర్శ

రౌతులపూడి : మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సోమరౌతు తిరుమల వెంకన్న దొర ఇటీవల అనారోగ్యానికి గురవగా ఆయనను వైసిపి ప్రతిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు ఆదివారం పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, భాస్కర్ బాబు, మాజీ జెడ్‌పిటిసి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

దస్తావేజు పోయినది

కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు, కరణంగారి తోట, డో.నెం. 5-135రు కాపురస్తులు విశ్వనాధుల రామకృష్ణ గారి భార్య **విశ్వనాధుల వీరలక్ష్మి** గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా ఆస్థికి సంబంధించి ది. **04-09-2023**వ తేదీన పిఠాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రీ కాబడిన సవరణ దస్తావేజు నెం. **8259/2023**ను జెరాక్స్ తీసుకొను నిమిత్తం ది.26-01-2024 తేదీన మా ఇంటి నుండి రాయవరం రోడ్డులో M.R.O. ఆఫీసు దగ్గరలో గల జెరాక్స్ షాపుకు తీసుకొనివెళ్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. సదరు సవరణ దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

విశ్వనాధుల వీరలక్ష్మి

W/o. రామకృష్ణ, డో.నెం.5-135

కరణంగారి తోట, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం

కాకినాడ జిల్లా, సెల్: 9494903540